క్లుప్తంగా

ఆజాద్ నగర్‌లో నీటి కష్టాలు



నీటి కోసం బిందెలతో వెళుతున్న ఆజాద్‌నగర్ వాసులు

చింతకొమ్మదిన్నె : పంచాయతీ పరిధిలోని ఆజాద్‌నగర్‌లోని కొన్ని వీధుల్లో తాగునీటి కష్టాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో అధిక శాతం మంది ప్రజలు కూలీ పనులు చేసుకుని జీవనం సాగిస్తుంటారని, మోటార్లు వేసుకున్న వారికే నీరు వస్తోందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా నీటి సమస్య పరిష్కరించాలని ఆజాద్‌నగర్ వాసులు కోరుతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐలు

వల్లూరు : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని వల్లూరు, కమలాపురం ఎస్‌ఐలు పెద్దఓబన్న, విద్యాసాగర్ హెచ్చరించారు. మండలంలోని గణేష్‌పురం, వల్లూరు ఎస్సీ కాలనీల్లో బుధవారం వారు నాకా బందీ నిర్వహించారు. అనంతరం స్థానికులతో సమావేశం ఏర్పాటు చేసి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. చైన్ స్నాచింగ్‌లతోపాటు గృహాల్లో దొంగతనాల నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అవగాహన కల్పించారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు




గాయపడ్డ బాబా ఫక్రుద్దీన్

వల్లూరు : మండలంలోని తప్పెట్ల బ్రిడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బాబాఫక్రుద్దీన్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. దుగ్గాయపల్లె గ్రామ పంచాయతీలోని ధర్మాపురం కాలనీకి చెందిన బాబాఫక్రుద్దీన్ ద్విచక్ర వాహనంలో కడప కు వెళుతుండగా కడప వైపు నుంచి వస్తున్న లారీ తప్పెట్ల బ్రిడ్జి వద్ద యువకుడి కాళ్లపై ఎక్కడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు బాధితుడిని కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పెద్ద ఓబన్న తెలిపారు.

పరామర్శ

చింతకొమ్మదిన్నె : స్థానిక పోలీసుస్టేషన్‌లో ఓ కేసులో వైఎస్సార్ నాయకులను అరెస్టు చేశారనే సమాచారం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, జెడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి బుధవారం కళాయాదవ్, బయనపల్లె శ్రీనివాసులరెడ్డిలను పరామర్శించారు.

వధూవరులకు ఆశీర్వాదం



కారపురెడ్డిపల్లెలో వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని కారపురెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడి ఇంటిలో జరిగిన వివాహానికి బుధవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డిలు హాజరై నూతన వధువరులు చెన్నకేశవరెడ్డి, తేజశ్విని ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డు సమీపంలోని సీనీ హబ్ వద్ద బుధవారం గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అతనికి సుమారు 60–65 ఏళ్లు ఉంటాయని వారు తెలిపారు. మృతుడి గురించి పరిసర ప్రాంత ప్రజలను విచారించినా అతని వివరాలు లభ్యం కాలేదు. ఎండ వేడిమికి తాళలేక అతను మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడికి సంబంధిచిన బంధువులు ప్రొద్దుటూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ బాలమద్దిలేటి తెలిపారు.

మురికి కూపాలుగా మారిన రోడ్లు



రాజీవ్‌నగర్ కాలనీలో డ్రైనేజీ కాలువలో చెత్తను తొలగిస్తున్న స్థానికులు



డ్రైనేజీ కాలువలో చెత్త చెదారాలను తొలగించిన ప్రజలు

● కాలువల్లో పూడికలు తీసుకుంటున్న స్థానిక ప్రజలు

వేంపల్లె : గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు 5 నెలలుగా జీతాలు రాకపోవడంతో రోడ్లన్నీ మురికినీటితో నిండిపోయాయి. దీంతో దుర్వాసన వెదజల్లడంతోపాటు ప్రజలు నడవలేని పరిస్థితిలో రోడ్లు ఉండటంతో అయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలే డ్రైనేజీ కాలువల్లో ఉన్న పూడికలను స్వయంగా తీసుకుంటున్నారు. శ్రీరాంనగర్ వీధిలోని కాలేజీ రోడ్డులో ఉన్న డ్రైనేజీ కాలువలు చెత్తతో నిండిపోయి మురికి నీరు కాలువల్లో ప్రవహించకుండా రోడ్డుపై నిలిచిపోయింది. దీంతో అ ప్రాంతాల్లో ఉన్న ప్రజలకు దుర్వాసన వెదజల్లుతున్న విషయాన్ని ఎన్నోసార్లు పంచాయతీ అధికారులకు, పారిశుధ్య కార్మికులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది.

అలాగే పంచాయతీ సిబ్బందికి అధికారులు జీతాలు ఇవ్వకపోవడంతో విధులోకి వెళ్లకపోవడంతో డ్రైనేజీ కాలువల్లో ఉన్న చెత్తను తొలగించేవారు కరువయ్యారు. దీంతో పారిశుధ్య కార్మికులతో అధికారులు పనులు చేయిస్తారనే నమ్మకం లేకపోవడంతో బుధవారం కాలేజీ రోడ్డులోని డ్రైనేజీ కాలువల్లోని స్థానిక ప్రజల సహకారంతో మురికినీరు రోడ్డుపై ప్రవహించకుండా కాలువల్లో ఉన్న చెత్తను తొలగించడం జరిగింది. ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా డ్రైనేజీ కాలువల్లో ఉన్న చెత్తను తొలగించలేదని, అందుకే అ కాలనీలో ఉన్న వారందరూ కలిసి పూడికలను తొలగించుకున్నట్లు తెలిపారు. రోడ్డుపై మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు పెరిగిపోవడంతోపాటు ప్రజలు రహదారిలో నడపలేక పోతున్నట్లు తెలిపారు. ఇంత అధ్వానంగా ఎన్నడూ చూడలేదని, పంచాయతీ పాలక మండలి కూడా పట్టించుకోవడం లేదన్నారు. కాలువల్లోని చెత్తను తొలగించి రోడ్లపై మురుగునీరు ప్రవహించకుండా చేసి ప్రజలు రోగాలబారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి వేంపల్లె పంచాయతీపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : దళిత భూములను కబ్జా చేసిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని అలిరెడ్డిపల్లెలో కబ్జాకు గురైన దళిత భూములను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ దళిత నాయకులతో కలిసి పరిశీలించారు. అలాగే బాధిత దళిత రైతుతో చర్చించారు. అదే విధంగా తహసీల్దార్‌ను కలిసి దళిత భూములను అగ్రవర్ణాలకు చెందిన వారు కబ్జా చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకుని దళితులకు న్యాయం చేయాలని కోరారు. మండలంలోని అల్లిరెడ్డిపల్లెలో దళితుల అనుభవంలో ఉన్న సర్వే నెంబర్ 644/2ఎస్1లో 2 ఎకరాల దళితుల భూమిని అగ్రవర్ణాలకు చెందిన నాగభూషణరెడ్డి తన రాజకీయ బలంతో ఆక్రమించారని, దళితులపై దౌర్జన్యం చేసి భయభ్రాంతులకు గురి చేసి భూమిని కబ్జా చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా కబ్జా విషయాన్ని తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వీరపు శేఖర్, ఎమ్మార్పీఎస్ పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి కమ్మటి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతోనే వ్యాధులను అరికట్టవచ్చు



మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మనాయక్

చింతకొమ్మదిన్నె : దోమల నియంత్రణతోనే వ్యాధులను అరికట్టవచ్చునని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ లక్ష్మనాయక్ తెలిపారు. బుధవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి రక్తపరీక్షల విభాగాన్ని, రికార్డులను, రిపోర్టులను తనిఖీ చేసి గణాంకాలు పరిశీలించారు. ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యంవహిస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో నిర్దేశించిన మేరకు రక్త నమూనాల సేకరణ జరిపి పరీక్షల నిమిత్తం పంపాలని తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడుతూ కీటక జనిత వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, బోదకాలు, మెదడువాపు వ్యాధి వంటి వ్యాధులను గురించి అవగాహన పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. మనం ఎక్కడ పడితే అక్కడ టీ కప్పులు, టెంకాయ చిప్పలు, పాత టయర్లు, ఉపయోగించని పాత్రలు అందులో వర్షపునీరు చేరి దోమలు గ్రుడ్లు పెడతాయని తెలిపారు. ఈ వ్యాధులను కలిగించే దోమలు నిల్వఉన్న నీటిలో ఒక్కసారి రెండువందల గుడ్లు పెడుతాయని అలానే తన జీవితకాలంలో వేయి నుండి రెండు వేల గుడ్లు పెడతాయని అందువల్ల అవి గ్రుడ్లు పెట్టకుండా చేయగలిగితే మనం వాటిని ప్రాథమిక దశలోని నియంత్రించవచ్చు అన్నారు. గ్రామాల్లో మురికినీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేయడంవల్ల లార్వాల గాలిగొట్టం మూసుకుపోయి లార్వాలు మరణిస్తాయని తెలిపారు. ప్రజలు దోమతెరలు వాడాలని తెలిపారు. తమ విభాగం లార్వాల నియంత్రణకు నీటి కుంటల్లో గంబూషియా చేపలు వదలుతుందని అలానే అబేట్ మందు స్ప్రే చేస్తామన్నారు. మండలంలో ఈ వారంలో షెడ్యూల్‌ను అనుసరించి పిచికారీ చేయడం జరుగుతుందని ప్రజలు సహకరించి వందశాతం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ సునీత, సమాజ ఆరోగ్య అధికారి సుకుమార్, పర్యవేక్షకులు జనార్ధన్, జయరత్నమ్మ, స్టాఫ్ నర్స్ ఫ్లోరెన్స్, ల్యాబ్ టెక్నిషియన్ ప్రసాద్ పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు ఎక్కడ చంద్రబాబు



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగపు నాయకులు

పులివెందుల : ఎన్నికల ప్రచార సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చిందని, ప్రస్తుతం ఆ హామీలను ప్రభుత్వం అమల్లో లేవని వైఎస్సార్‌సీపీ యూత్ యువజన విభాగపు నియోజకవర్గ అధ్యక్షుడు రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగపు జిల్లా కోశాధికారి రాఘవేంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్‌లు తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక భాకరాపురంలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఉచిత విద్యుత్, రుణ మాఫీ, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, నిరుద్యోగ భృతి, నిరుపేదలకు ఆరోగ్య సేవలు, ఉచిత వైద్యం, మెరుగైన వైద్య సేవలు, అర్హులైన ప్రజలకు ఇంటి స్థలాలు, గృహ నిర్మాణ ప్రణాళికలు తదితర హామీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ ప్రస్తుతానికి వీటిపై ఎటువంటి స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో నిరాశ, అసంతృప్తి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చని పక్షంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఎండగడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

పులివెందుల టౌన్ : ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఏరియా కార్యదర్శి గఫూర్ తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక గఫూర్ డ్రైవింగ్ స్కూలులో కేంద్ర కార్మిక సంఘాలు, సీఐటీయూల ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్మిక సంఘ నాయకులు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నామన్నారు. ఈసమ్మెలో ప్రభుత్వ రంగ సంస్థలైన బ్యాంకింగ్, ఎల్ఐసీ, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ సంస్థల ఉద్యోగులు పాల్గొంటున్నారని, ప్రభుత్వ పథకాలలో పనిచేసే ఉద్యోగులు, అసంఘటిత కార్మికులందరూ కూడా పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో స్టేట్ ర్యాంక్‌లు

మైదుకూరు : ఇటీవల జరిగిన పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్)లో మైదుకూరులోని ఎస్‌వీ స్టడీ సర్కిల్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి ర్యాంక్‌లు వచ్చినట్లు స్టడీ సర్కిల్ యజమాని జి.ప్రజాపతి తెలిపారు. స్టడీ సర్కిల్‌కు చెందిన ఎస్‌వీ కీర్తి 156వ ర్యాంక్, డి.స్వాతి 435వ ర్యాంక్, వైవీ సౌమ్యం 971వ ర్యాంక్, ఏఎల్ నరసింహారెడ్డి 991వ ర్యాంక్ సాధించినట్లు ఆయన వివరించారు. తమ స్టడీ సర్కిల్‌కు చెందిన 20 మంది విద్యార్థులు 10వేల లోపు ర్యాంక్ సాధించినట్లు తెలిపారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. చర్మవ్యాధుల ప్రముఖ వైద్య నిపుణురాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్‌ఫెక్షన్, మొటిమలు, బొడులు, దద్దుర్లు, చుండ్రు తదితర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్ కు మాటలు రాని వారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, చెవి, ముక్కు, గొంతునకు సంబంధించిన అనేక సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

వేసవిలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి



ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు

చింతకొమ్మదిన్నె : ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ అధికారి లావణ్య ఆధ్వర్యంలో బుధవారం తాడిగొట్ల గ్రామంలో ఉచిత ఆరోగ్య శిబిరం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఉన్న రైతులు, వృద్ధులు, బాలింతలు, చిన్నపిల్లలు వేసవికాలంలో ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉచిత ఆరోగ్య శిబిరంలో ప్రతి ఒక్కరూ ప్రాథమిక పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ పౌష్టిక ఆహారం తీసుకోవాలని సూచించారు. రోజువారి ఆహారంలో చిరుధాన్యాలు, పండ్లు చేర్చుకోవాలని తెలియజేసి 60 మంది రోగులకు ప్రాథమిక పరీక్షలు జరిపి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఒసామా చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ వేశారు. కార్యక్రమంలో డీఈవో మహమ్మద్ అలీ, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రవీణ, ఏఎన్ఎం సుభా షిని, వ్యవసాయ కళాశాల విద్యార్థులు ప్రజలు పాల్గొన్నారు.

మినీ సెక్రటేరియట్‌లోకి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్

పులివెందుల రూరల్ : పట్టణంలోని అంబకపల్లె రోడ్డు సమీపంలోని ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ వెనుకవైపు ఉన్న ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌ను అదే రోడ్డులో ఉన్న మినీ సెక్రటేరియట్‌లోకి మార్చినట్లు ఎక్సైజ్ శాఖ సీఐ చెన్నారెడ్డి తెలిపారు. ఎక్సైజ్‌కు సంబంధించిన సమాచారాన్ని, నాటుసారా తయారీ సమాచారాన్ని మినీ సెక్రటేరియట్‌లోని ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి వచ్చి సమాచారం ఇవ్వాలన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



కోలాటం చేస్తున్న బృంద సభ్యులు, భక్తులు



పూజా కార్యక్రమాలు చేస్తున్న నిర్వాహకులు సాయినాథ శర్మ దంపతులు



ఆలయంలో మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి

కమలాపురం : మండలంలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. వేద పండితులు ఘనాపాటి వంశీకృష్ణ ఆచారత్వమున ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చనలు, సర్పసూక్త పారాయణం, సమస్త పరివార దేవతా మూర్తుల హోమాలు మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, చక్రస్నానం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణుడు గరుడ వాహనంపై, సుబ్రహ్మణ్యస్వామి మయూర వాహనంపై మాడ వీధులతో ఊరేగారు. నిర్వాహకులు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. మహిళల కోలాటం, చెక్క భజన భక్తులను అలరించాయి.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు

మండలంలోని రామాపురంలో జరుగుతున్న మోక్ష నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు రసవత్తరంగా సాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 5 జతల కాండ్లు రాతి దూలాన్ని ఈడ్చాయి. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు. రూ.20వేలు, రూ.5వేల నగదు బహుమతులను అందజేశారు.

అలాగే శ్రీ మోక్షనారాయణస్వామికి మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోక్షనారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు బుధవారం మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఆయన సతీమణి ప్రభావతమ్మ, ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డిలకు నిర్వాహకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ వ్యవస్థాపకులు సత్య సాయినాథ శర్మ వారికి శాలువ కప్పి, పూలమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

పులివెందులలో ‘రిచ్ కిడ్’ సినిమా షూటింగ్

పులివెందుల రూరల్ : పట్టణంలో రిచ్ కిడ్ సినిమాకు సంబంధించి బుధవారం ఫైట్ సీన్లను చిత్రీకరించారు. సినిమా షూటింగ్ జరుగుతుండటంతో ప్రజలు సినిమా షూటింగ్ చూసేందుకు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా మంజునాథరెడ్డి (బుల్‌రెడ్డి) మాట్లాడుతూ గతంలో మా ఊరి సినిమా పులివెందుల నియోజకవర్గంలోనే తీసి ఆ సినిమాకు మంచి పేరు వచ్చిందన్నారు. రిచ్ కిడ్ సినిమాకు డైరెక్టర్లుగా షఫి, అనిల్, కెమెరామెన్లు మల్లి, ధర్మల ఆధ్వర్యంలో ఈ సినిమా చిత్రీకరిస్తున్నామన్నారు. ప్రస్తుతం రిచ్ కిడ్ సినిమా పూర్తయిందన్నారు. త్వరలోనే ఈ సినిమాను రిలీజ్ చేస్తామన్నారు. ఈ సినిమాలో ప్రత్యేక సన్నివేశంలో రాజక్కగా పులివెందుల బిడ్డ అమ్ములు నటించిందన్నారు. పులివెందుల ప్రాంతంలో ఎంతోమంది కళాకారులు ఉన్నారని, వారి టాలెంట్‌ను బయటకు తీయడమే లక్ష్యంగా సినిమాలు తీస్తున్నానన్నారు. త్వరలోనే మరొక సినిమా తీయనున్నానని తెలిపారు. కార్యక్రమంలో నటీనటులు, చిత్ర యూనిట్ బృందం తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలి



మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీలో ఎక్కడైనా మ్యాన్‌హోళ్లలో మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని స్థానిక ముత్యాలవారి వీధిలో మ్యాన్‌హోల్ దెబ్బతిని మురుగునీటికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ విషయం తెలుసుకున్న ఆయన మున్సిపల్ సిబ్బందిని అక్కడికి పిలిపించి శుభ్రం చేయించారు. వర్షాలు పడే సమయంలో అడ్డంకులు ఏర్పడితే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, వెంటనే ఇబ్బందులను గుర్తించి పూడికలు తీయించి శుభ్రంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ ఖాదర్, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారుల్లో చెత్తాచెదారాల తొలగింపు



డ్రైనేజీ కాలువలో చెత్తా చెదారాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది



వేంపల్లె ప్రధాన రహదారిలో తొలగించిన చెత్తా చెదారాలు

సాక్షి ఎఫెక్ట్..

వేంపల్లె : గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన రహదారుల్లో చెత్తాచెదారాలను పంచాయతీ సిబ్బంది తొలగించారు. మంగళవారం సాక్షి దినపత్రికలో ×కదలని చెత్తాచెదారాలు, మురుగునీర్లు అనే శీర్షిక ప్రచురితం కావడంతో సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు చొరవ తీసుకుని పంచాయతీ సిబ్బందితో మాట్లాడి చెత్తాచెదారాలను తొలగించారు. కాపు వీధిలోని డ్రైనేజీలో చెత్తాచెదారాలతో నిండి మురుగునీరు రోడ్డుపై పారుతున్న వాటిని తొలగించి మురుగునీరు పారే విధంగా చర్యలు తీసుకున్నారు. ఇంకా కొన్ని ప్రాంతాల్లో చెత్తాచెదారాలు నిండుకుండున్నాయి. రెండు, మూడు రోజుల్లో గ్రామ పంచాయతీలో ఎక్కడా కూడా డ్రైనేజీ, పారిశుద్ధ్యం లేకుండా చూస్తామని సర్పంచ్ హామీ ఇచ్చారు. సర్పంచ్ పంచాయతీ సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున తన సొంత నిధులను అడ్వాన్స్‌గా అందజేయడంతో పారిశుధ్య సిబ్బంది తమ పనులను చేసుకుంటున్నారు.

పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత



మాట్లాడుతున్న ఎంపీడీఓ కృష్ణమూర్తి

సింహాద్రిపురం : పండ్ల తోటల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో రైతులకు పండ్ల తోటల పెంపకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈనెల 16వ తేదీ నుంచి 23వ తేదీ వరకు పండ్ల తోటలు పెంచుకునే రైతులను గుర్తించడానికి అన్ని గ్రామాలలో సదస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా గ్రామాల్లో ఏ పండ్ల తోట కావలసిన వారు రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని, అలాగే సన్న కారు రైతులకు ఉపాధి హామీ పథకం కింద, పెద్ద రైతులకు హార్టికల్చర్ స్కీంల కింద మొక్కలను అందిస్తారని, పండ్లతోట పెంపకాలకు ఆసక్తి ఉన్న రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఓ శివమోహన్‌రెడ్డి, ఏపీఓ జయభారతి, ఈసీ శ్రీనివాసరెడ్డి, వీహెచ్ఏలు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

వెల్లాలలో వైభవంగా తిరునాల

రాజుపాళెం : మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర స్వామి బ్రహోత్సవాలలో భాగంగా బుధవారం రథోత్సవం (తిరునాల) అంగరంగ వైభవంగా జరిగింది. సాంప్రదా య బద్ధంగా వేద పండితులు హోమం నిర్వహించి, పూజలు చేసి స్వామివారి రథంను దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ మల్లిఖార్జున ప్రసాద్, ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ చైర్మన్ లక్ష్మినారాయణ రెడ్డి టెంకాయలు కొట్టి ప్రారంభించారు. ముందుగా తిరునాలకు వచ్చిన కొంతమంది భక్తులు తలనీలాలు సమర్పించి కుందూనదిలో స్నానాలు చేశారు. వివిధ రకాల బొమ్మల అంగళ్లు ఏర్పాటు చేయడంతో ఆలయం వద్ద నూతన శోభ సంతరించుకుంది. పెద్దసంఖ్యలో ఆయా గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వాములను దర్శించుకున్న అనంతరం పిల్లలతో కలిసి ఆనందంగా తిరిగారు. స్వాముల వారిని మాజీ జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, పురుషోత్తంరెడ్డి, గ్రామాల్లోని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. రథం వద్దకు కొంతమంది మహిళలు బోనాలు సమర్పించిన అనంతరం రథా న్ని ముందుకు కదిలించారు.